కర్ణాటకలో తమిళ సినిమాలు ఆడనివ్వం

● వాటాళ్‌నాగరాజ్ హెచ్చరిక

బొప్పాయి సాగుతో అధిక లాభాలు

● ఎకరాకు రూ.3లక్షలు గడిస్తున్న బళ్లారి జిల్లా రైతు

6





మద్యం వ్యాపారుల అక్రమాలకు

చెక్..!

● ఒక వ్యక్తికి ఒకే లైసెన్స్ ● ఏళ్ల తరబడి సిండికేట్‌తో అబ్కారీకి భారీ నష్టం

● నూతన పాలసీకి సిద్ధమైన ప్రభుత్వం ● కొత్తగా 1,725 వైన్‌షాప్‌ల అనుమతికి సిద్ధం

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మద్యం విక్రయాల లైసెన్స్‌ల విషయంలో కొన్నేళ్లకాలంగా సాగుతున్న అడ్డదారులకు చెక్ పెట్టేందుకు ఎక్సైజ్‌శాఖ సిద్ధమైంది. ఇందుకోసం ప్రత్యేకమైన పాలసీని తీసుకొచ్చే ఆలోచనలో ఉంది. మద్యం వ్యాపారం అంటే పోటీతత్వం, ప్రత్యర్థులకు ఎక్కడా అవకాశం దక్కకుండా అడ్డుకోవడం, వ్యాపార విషయంలో దౌర్జన్యం వంటివి సాధారణం అయ్యాయి. ఇలా దశాబ్దాల కాలంగా లైసెన్స్‌లు పొందేవారు చిన్నపట్టణాలు, మహానగరాల్లో కొన్ని ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకుని బార్ లైసెన్స్‌లు పొందుతున్నారు. బార్‌లకు అనుమతి ఇచ్చే విషయంలో ఎక్సైజ్‌శాఖ ఎన్నో ఏళ్లుగా పలు నిబంధనలు అమలు చేస్తోంది. అయితే వ్యాపారంలో ఉన్న సీనియారిటీ, ఉన్నతాధికారులతో పరిచయాలు వంటి మార్గాల్లో కొందరికే బార్ లైసెన్సులు వరిస్తున్నాయి. ఎంతోమంది బార్‌లైసెన్సులకోసం ఏళ్ల తరబడి చేస్తున్న ప్రయత్నాలు సాధ్యం కావడం లేదు. మద్యం వ్యాపారాల్లో స్థిరపడినవారు ఇతరుల పేర్లతో పలు లైసెన్స్‌లు పొంది బార్ అండ్ రెస్టారెంట్‌లు నడుపుతున్నారు. ఇలా ఒక్కక్కరికి సుమారు 50 దాకా వైన్‌షాప్‌లు, బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉన్నాయంటే ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. బార్‌లు, వైన్‌షాప్‌ల లైసెన్సులు ఏటా రెన్యూవల్ చేస్తారు. అయినా అక్రమ మార్గాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇలాంటి వ్యాపారాలకు స్వస్తి పలకాలనే ఎక్సైజ్‌శాఖ సీనియర్ అధికారులు కొత్త మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నారు. వాటి ప్రకారం ఒక్కొక్కరికి ఒకే లైసెన్స్ పొందే విధానాన్ని తీసుకురాదలిచారు. ఇది అమలులోకి వస్తే ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం పెరగనుందని భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నగర ప్రాంతాల్లో 2,510, గ్రామీణ ప్రదేశాలలో 1438లతో కలిపి మొత్తం 3,948 వైన్‌షాప్‌లు ఉన్నాయి.

కొత్త లైసెన్స్‌లు సులువేమీ కాదు..

ప్రభుత్వం అమలు చేయదలిచిన నిబంధనలకు పలు శక్తివంతమైన కారణాలు అడ్డు కానున్నాయి. అందులో రాజకీయ నాయకులు, పలుకుబడి కల్గినవారే అధికమంది లైసెన్స్‌లు కలిగి ఉండడంతో అడ్డుకోవడం అంత సులువు కాదనేది తెలిసిందే. పదుల సంఖ్యలో లైసెన్స్‌లు పొందినవారు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే అవకాశాలు ఉన్నాయి. పాత లైసెన్స్‌లు పూర్తిగా తొలగించి కొత్తగా వేలం రూపంలో లైసెన్స్‌లు మంజూరు చేయడం అంత సులువేమీ కాదు. వేలం ప్రక్రియలో ఆర్థిక బలం ఉన్నవారికి మాత్రమే అవకాశాలు మెండగా ఉంటాయనేది తెలిసిందే.

దుకాణాలు పెరిగే అవకాశం

రాష్ట్రంలో కొత్తగా 1725 వైన్‌షాప్‌ల మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి అవకాశం ఉంది. 1981 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 4,206 వైన్‌షాప్‌లకు అనుమతి ఉంది. అందులో ప్రస్తుతం 3948 షాపులు పనిచేస్తున్నాయి. మిగిలిన మద్యం షాపుల లైసెన్స్‌లు ఆధునీకరించాల్సి ఉంది. అబ్కారీ నిబంధనల ప్రకారం 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో కొత్తం 1725 వైన్‌షాపుల మంజూరుకు ప్రభుత్వానికి అవకాశం ఉంది. ఎక్సైజ్ శాఖ 12వ నిబంధన ప్రకారం తాలూకా, పట్టణ ప్రదేశాలలో 7,500 మంది జనాభాకు ఒక వైన్‌షాప్ మంజూరు చేయనున్నారు. గ్రామీణ ప్రదేశాలలో 15000మందికి ఒక వైన్‌షాప్ మంజూరు చేయాల్సి ఉంది. తాలూకా, నగర ప్రదేశాలను ఏ కోటాగాను, గ్రామీణ ప్రదేశాలను బి కోటాగాను పరిగణిస్తారు. 1987లో ప్రతి జిల్లాలోనూ తాలూకా, పట్టణ ప్రదేశాలలో సీఎల్2 కోటా కింద నిర్ణయించారు. సీఎల్ 2 కోటాలో పట్టణ ప్రాంతాలలో 2158, గ్రామీణ ప్రాంతాలలో 2048లతో కలిపి 4206 వైన్ షాప్‌లకు నిర్ణయించారు.

నిబంధనలు కఠినతరం

కొత్త నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఎన్ని చోట్ల వైన్‌షాప్‌లు, బార్‌లకు అనుమతులకోసం దరఖాస్తు చేసుకున్నా కేవలం ఒక చోట మాత్రమే మంజూరు చేస్తారు. అతడి పేరిట రాష్ట్రంలో రెండో లైసెన్స్ ఉండేందుకు వీలు లేకుండా చేయదలిచారు. ఈ విధానం పాటిస్తే వ్యాపారుల మధ్య ఉండే సిండికేట్‌కు అవకాశం లేకుండా పోతుంది. సొంతంగా లైసెన్స్‌లు పొందాలని, మద్యం వ్యాపారాలు సాగించాలని, ప్రయత్నిస్తున్నవారికి అవకాశం కల్పించినట్లు అవుతుంది. ప్రస్తుతం ఒక్కో ప్రాంతంలో ఒకరి పేరునే పదుల సంఖ్యలో లైసెన్స్‌లు ఉన్నట్లు గుర్తించారు. మరికొంతమంది వ్యాపారాలు వారి కుటుంబ సభ్యులు, ఆప్తులు, మిత్రుల పేరిట లైసెన్స్‌లు పొందుతున్నారు. మరొకరికి అవకాశం ఇస్తే మద్యం వ్యాపారాలలో భవిష్యత్తు ఉండదనేది పలువురి అభిప్రాయంగా ఉంది.

మద్యం వ్యాపారాలు కొంతమందికే పరిమితంగా ఉండడంతో వారు సిండికేట్ కావడం, ప్రాంతాలవారీగా అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకోవడంతో ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతోంది. మద్యం దుకాణాల లైసెన్స్‌లు వేలం రూపంలో వేయాలని తీర్మానించారు. ఇలా ఒక్కొక్కరు ఎన్ని లైసెన్స్‌లు పొందినా, చివరకు ఒకే లైసెన్స్ మంజూరు చేయదలిచారు. ఈ విధానంతో లైసెన్స్‌ల రూపంలోనే వేల కోట్ల రూపాయల ఆదాయం చేకూరనుందని భావిస్తున్నారు.

రాష్ట్రంలో 13,519 దుకాణాలు

రాష్ట్రవ్యాప్తంగా 4002 వైన్‌షాప్‌లు (సీఎల్2), 302 క్లబ్‌లు (సీఎల్ 4), 95 స్టార్ హోటళ్లు (సీఎల్ 6ఏ), 2994 బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ హోటళ్లు (సీఎల్7), 71 మిలిటరీ క్యాంటీన్‌లు (సీఎల్8), 3644 బార్ అండ్ రెస్టారెంట్లు (సీఎల్ 9), 1071 (మైసూరు సేల్స్ అండ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) (ప్రభుత్వ అనుబంధ కార్పొరేషన్), 745 ఆర్‌విబి లైసెన్స్(రిటైల్ బీర్ వెండింగ్), వైన్ టవర్స్ 202, వైన్ బోటిక్ 87లు ఉన్నాయి. సీఎల్ 6ఏ, సీఎల్ 4, సీఎల్ 7లను మినహాయించి కొత్తగా సీఎల్2, సీఎల్ 9 మద్యం దుకాణాలకు లైసెన్సులు ఇవ్వడాన్ని 1992లోనే ఎక్సైజ్‌శాఖ నిలిపివేసింది. గతంలో లైసెన్స్‌లు పొందినవారు 30ఏళ్లుగా మద్యం దుకాణాలను కొనసాగిస్తున్నారు.





జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

విద్యాభివృద్ధితోనే కళ్యాణకర్ణాటక ప్రగతి

● ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే

బెంగళూరు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధితోనే వెనుకబడిన కళ్యాణకర్ణాటక జిల్లాలలో ప్రగతి సాధ్యమని రాజ్యసభలో ప్రతిపక్షనేత, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే అభిప్రాయపడ్డారు. గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్‌శాఖ, కళ్యాణకర్ణాటక ప్రాంతీయ అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో కలబురిగి జిల్లా జేవర్గిలో శనివారం కళ్యాణకర్ణాటక పథ పథకానికి శంకుస్థాపన చేశారు. ముఖ్యులుగా హాజరైన మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ వెనుకబడిన కళ్యాణకర్ణాటక జిల్లాలకు 371జే ఆర్టికల్ వర్తించడాన్ని ఉత్తరభారతీయులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కళ్యాణ కర్ణాటకకు ఐదువేల కోట్లు కేటాయించడంపై డీసీఎం వ్యాఖ్యలనుద్దేశించి మాకు లక్ష కోట్లు ఇచ్చినా బెంగళూరు ప్రాంతం తరహాలో అభివృద్ధి చెందడం త్వరితగతిన సాధ్యం కాదన్నారు. పరిశ్రమలు, ఉన్నత విద్య పెంపుద్వారా అభివృద్ధి జరుగుతుందన్నారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు ప్రియాంకఖర్గే, శరణబసప్ప దర్శనాపుర, శరణుప్రకాష్ పాటిల్ రహీంఖాన్, అజయ్‌సింగ్, ఎంపీ రాధాకృష్ణదొడ్డమని తదితరులు పాల్గొన్నారు.

సభలో ఎస్సీ వర్గీకరణ నినాదాలు

● కట్టడి చేసిన మార్షల్స్.. ఏడుగురి అరెస్టు

బెంగళూరు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను అసెంబ్లీలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆర్థికమంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న వేళ వర్గీకరణ నినాదాలు చేసిన మేరకు ఏడు మందిని అరెస్టు చేశారు. శుక్రవారం బడ్జెట్ జరుగుతుండగా ప్రేక్షకులు గ్యాలరీలో కూర్చొన్నవారు ఒక్కసారిగా ఎస్సీ వర్గీకరణ జరపాలని, సదాశివ కమిషన్ అమలు చేయాలని నినాదాలు చేశారు. దీంతో బడ్జెట్ చదువుతున్న సీఎం సిద్దరామయ్య ఒక్కసారిగా ఖంగుతిని నిలిపివేశారు. ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌తో పాటు ఇండిపెండెంట్ సభ్యులంతా నిశబ్దంగానే ఉన్నా ఎక్కడి నుంచి నినాదాలు వచ్చాయనేది హల్‌చల్ చేసింది. అంతలోనే మార్షల్స్ గ్యాలరీలోకి ప్రవేశించి ఏడుగురు వ్యక్తులను కట్టడి చేశారు. మార్షల్స్‌చీఫ్ హెచ్‌ఎస్ జయకృష్ణ వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. పట్టుబడిన వారిలో హెచ్‌ఎస్ఆర్ లేఅవుట్‌కు చెందిన ఎ. విజయ్‌కుమార్, ఎస్‌వీ సురేష్, చొక్కసంద్ర వేణుగోపాల్, ఎన్ఎస్ విజయశేఖర్, అంబేడ్కర్ కాలనీ వాసి ఎస్‌వీ శ్రీనివాస్, హొసపాళ్య సత్యేంద్రకుమార్, ఎం రాజరత్నంలు ఉన్నారు. శాసనసభ నిబంధనలను ఉల్లంఘించారని విధానసౌధ పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు వారందరినీ అరెస్టు చేశారు. గతంలోను ఇటువంటి ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయి. రెండేళ్ళకిందట బడ్జెట్ రోజునే ఓ వ్యక్తి నినాదాలు చేశారు. మరోసారి ఏకంగా అసెంబ్లీలోకి ఓ న్యాయవాది వెళ్ళి కూర్చొన్న మేరకు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.



వాకథాన్‌లో మహిళలు

ఉత్సాహంగా ఉమెన్స్ డే..!

● నగరంలో వాకథాన్‌కు వేలాదిగా తరలివచ్చిన మహిళలు

బెంగళూరు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళ్యాణనగర్‌లో నిర్వహించిన వాకథాన్‌లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ట్రైలైఫ్ ఆసుపత్రి నిర్వహించిన వాకథాన్‌కు రెండువేల మందికి పైగా నగరంలోని వివిధ ప్రాంతానికి చెందిన ఔత్సాహిక మహిళలు, విద్యార్థినులు భాగస్వామ్యులయ్యారు. ఉమెన్- అథాన్ పేరిట వాకథాన్ అనంతరం చర్చాగోష్టి జరిపారు. మౌలిక సదుపాయాలు, మహిళలు సమాజంలో ఎదుర్కొనే సమస్యలు, ఆరోగ్య సమస్యలపై వైద్యులు మాట్లాడారు. మహిళలు శారీరకంగానే కాకుండా మానసికంగాను ధృఢంగా ఎదగాలని పిలుపునిచ్చారు. వ్యాయామం, జీవనశైలితో పాటు నియమిత స్క్రీనింగ్‌ల ప్రాధాన్యతను వివరించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా నందీశ్వరస్వామి రథోత్సవం

కంప్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని బయలు తుంబరగడ్డి గ్రామంలో నందీశ్వర స్వామి రథోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో హోమాలు, వాహనసేవలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిరేమఠం లోని కూడ్లిగి ప్రశాంత్ సాగరస్వామి కలశారోహణం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజలు సాయంత్రం ఆలయం నుంచి ఎదురు బసవన్న ఆలయం వరకు రథం లాగారు. భక్తులు పూలు, పండ్లతో స్వామివారికి మొక్కలను సమర్పించుకున్నారు. రాత్రంతా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కటకటాల్లోనే పాఠాలు..!

● బళ్లారి సెంట్రల్ జైలు నుంచి 400మందికి పైగా పట్టుభద్రులు ● 14వేల పుస్తకాలతో గ్రంథాలయం..



బళ్లారి గాంధీనగర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జైలు అంటేనే కరడుగట్టిన ఖైదీలు.. తప్పు చేసిన నేరస్తులు మాత్రమే కాదని నిరూపించారా ఖైదీలు. తెలిసో తెలియక తప్పుచేసి జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఎందరో బళ్లారి సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవిస్తూ పట్టభద్ర విద్య పూర్తి చేశారు. ఇప్పటి వరకు దాదాపు 400 మంది వివిధ డిగ్రీలు పూర్తి చేసి బయటకు రావడం నిజంగా విశేషం బ్రిటీషు వారి కాలం నుంచి అండమాన్ నికోబార్ జైలు తరువాత రెండో స్థానంలో బళ్ళారి సెంట్రల్ జైలు విశాలంలో రెండో స్థానంలో ఉందని చెప్పవచ్చు. రాష్ట్రంలో ఎక్కడ అల్లర్లు జరిగినా...అందుకు కారుకులైన నిందితులను ఉంచడానికి బళ్ళారికి జైలును ఎన్నిక చేస్తారు. అయితే జైలు అంటేనే ఖైదీల బంధీఖానా కాదు....జైలులో కూడా అక్షర జ్ఞానం ఉందనడానికి బళ్ళారి జైలే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బళ్ళారి జైలులో ఇప్పటి వరకు 400మందికి పైగా పట్టుభద్రులు శిక్షా కాలంలోనే డిగ్రీ పట్టాపొంది విడుదలైనట్లు జైలు అధికారులు పేర్కొంటున్నారు. 2012 సంవత్సరం నుంచి బళ్లారి జైలులో దూర విద్య శిక్షణ పొందడానికి అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు 400మందికి పైగా శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు డిగ్రీ పట్టాలు పుచ్చుకున్నారు. గతంలో ఎంతో మంది డిగ్రీ పొందిన ఖైదీలు శిక్షపూర్తి చేసిన తర్వాత జైలు నుంచి విడుదలై ఉత్తమమైన జీవనం సాగిస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. చదువుకునే ఆసక్తి కలిగిన ఖైదీలు జైలు అధికారులు అందిస్తున్న సహాయ సహకారాలతో వందలాది మంది ఖైదీలకు అక్షర జ్ఞానం ఇవ్వడానికి సాధ్యమైందని చెప్పవచ్చు. జైలు నుంచే పరీక్షలు రాసిన ఖైదీలు పీయూసీ, డిగ్రీలతో పాటు వివిధ సర్టిఫికెట్ కోర్సులు కూడా పూర్తి చేయడంతో పాటు జైలులోనై పీజీలు పూర్తి చేశారు. వివిధ కారణాల చేత డిగ్రీ పూర్తి చేయని వారికి గత 14 సంవత్సరాలుగా ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యునివర్శిటీ(ఇగ్నో) సహకారంతో బళ్ళారి కేంద్ర కారాగహంలో దూరశిక్షణ వ్యవస్థను ప్రారంభించారు. ప్రారంభంలో కేవలం 10మంది ఖైదీలు మాత్రమే దూరవిద్య సేవలు పొందినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అనంతరం దూర విద్య ద్వారా డిగ్రీలు, ఇతర సర్టిఫికెట్ కోర్సులు పొందుతున్న వారి సంఖ్య పెరుగుతూ వచ్చిందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. గత పది సంవత్సరాల్లో 422 మంది జైలు ఖైదీలు డిగ్రీలు, పీజీలు పూర్తి చేసారంటే... ఖైదీల్లో కూడా విద్య పట్ల ఆసక్తి ఎంతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఏడాది ఎంతోమంది డిగ్రీ పరీక్షలు రాయనున్నట్లు జైలు అధికారులు తెలిపారు. కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న సమయంలో డిగ్రీ పూర్తిచేసిన వారు ఎన్నో ప్రయోజనాలు పొందినట్లు, జైలు నుంచి విడుదలైన తరువాత ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారని అధికారులు తెలిపారు. చదువుకునే ఆసక్తి ఉన్న వారిని దృష్టిలో పెట్టుకుని బృహత్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు, వివిధ విషయాలకు సంబంధించి ఈ జైలులో 14వేల పుస్తకాలు ఉన్నాయి. ఉదయం 10.30గంటల నుంచి 1.30గంటల వరకు, సాయత్రం 3.30గంటల నుంచి 5.30గంటల వరకు గ్రంథాలయం పనిచేస్తుంది. ఈ సమయంలో ఆసక్తి ఉన్నవారు గ్రంథాలయానికి వెళ్ళి తమకు ఇష్టమైన పుస్తకాలను చదవుతుంటారని, దూర విద్య పొందుతున్న వారికి బయటి నుంచి ఉపన్యాసకులు వచ్చి విద్యాబోధన చేస్తుంటారు. చదవడానికి అవసరమైన వాతావరణంలో జైలు అధికారుల సహాయం, ప్రోత్సాహంతో జైలులోనే ఉన్నత విద్యను పూర్తి చేయడం ఖైదీలకు సాధ్యమవుతోందని చెప్పవచ్చు.



బళ్లారి కేంద్ర కారాగారం

జైళ్లు పరివర్తనా కేంద్రాలు కావాలి...


● లత, జైలు సూపరింటెండెంట్

క్షణికావేశంతో చేసిన తప్పుల ప్రాయశ్చితమే మనిషిలో పరివర్తనకు దారితీస్తుంది. జైలుకు వచ్చినంత మాత్రాన... జీవితం ముగిసిపోయినట్లు కాదు, జైలు నుంచి విముక్తి లభించిన తర్వాత సమాజంతో ఉత్తమ జీవనం సాగించాలన్నదే మా ఉద్దేశం. జైలులో శిక్ష అనుభవిస్తునే ఎంతో మంది చదువుకుని దూర విద్య ద్వారా సర్టిఫికెట్ కోర్సులు, డిగ్రీలు, పోస్టుగ్రాడ్యుయేట్‌లు చేసిన వారు సుమారు 400మంది బళ్ళారి జైలులోనే పట్టాలు పొందారు. ప్రస్తుతం జైలులో అండర్‌ట్రైయిల్ పురుషులు19 మంది ఉండగా, నలుగురు మహిళలు, నేరాలు రుజువుతో శిక్ష అనుభవిస్తున్న 16మంది పురుషులు ఉన్నారు. చదువుకునే ఖైదీలెవరైనా సహకారం అందిస్తాం.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.45	5.19
ఆదివారం సాయంత్రం	సోమవారం ఉదయం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1604.13	1,585.43
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,051	2.242
నీటి నిల్వ (టీఎంసీలు)	27.35	7.61

రాష్ట్ర బడ్జెట్‌పై తప్పుడు ప్రచారాన్ని ఆపాలి

● కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు సోమశేఖర్



సోమశేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు

హోస్పేట (విజయనగరం), ఫిబ్రవరి 08 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సిద్దరామయ్య రికార్డు స్థాయిలో ప్రవేశపెట్టిన 16వ బడ్జెట్‌కు సంబంధించి ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రకటనలు చేస్తున్నాయని విజయనగర జిల్లా కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. శనివారం పార్టీ షెడ్యూల్డ్ కులాల విభాగం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రతిపక్ష నాయకులు ఆర్ అశోక్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజేంద్ర హలాల్ కట్ బడ్జెట్ అని విమర్శించడం తగదన్నారు. అలాంటి విమర్శలు ప్రతిపక్ష నాయకులకు కీర్తిని తీసుకురావన్నారు. ఈ రాష్ట్రంలో మైనార్టీలు అంటే ముస్లింలు మాత్రమే కాదు క్రైస్తవులు, జైనులు, బౌద్ధులు, సిక్కులు కూడా అని ఆర్ అశోక్‌కు తెలియకపోవచ్చన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్ పరిమాణం రూ. 4,09,549 కోట్లు వారు ఈ భారీ బడ్జెట్ గురించి చర్చించాలి. దానిని పక్కన పెడితే రూ. 4500 కోట్లు బడ్జెట్ గురించి మాత్రమే మాట్లాడటం బాధ్యతారహిత ప్రకటన. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న సిద్దరామయ్య బడ్జెట్ చర్చలను మీరు చూస్తే ఆ సమయంలోని యూట్యూబ్ ఛానళ్లను చూస్తే ప్రతిపక్ష పార్టీ ఎలా వుంటుందో దాని ప్రవర్తన, పనితీరు ఏమిటో మీకు అర్థమవుతుందన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులను అభినందిస్తున్న శాంతినికేతన్ విద్యా మందిర చైర్మన్ చలపతి కృష్ణ

సిరుగుప్ప, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలలో ప్రతి ఒక్క విద్యార్థి అత్యధిక మార్కులు దక్కించుకుని ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని శాంతినికేతన హైస్కూలు చైర్మన్ చలపతి కృష్ణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం సిరుగుప్ప పట్టణం శాంతినికేతన విద్యామందిర్‌లో మహిళా దినోత్సవం, శివకుమార్ స్వామి జయంతిని పురస్కరించుకుని పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చలపతి కృష్ణ మాట్లాడుతూ నేటి రోజుల్లో విద్యార్థుల భవిష్యత్తు చదువుపై ఆధారపడి వుంటుందని తెలిపారు. విద్యార్థులు వివిధ నృత్య ప్రదర్శనలు చేశారు. గత యేడాది అధిక మార్కులు దక్కించుకున్న విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థులను ఎంతగానో ప్రశంసించారు. ముందు రోజుల్లో కూడా ఈ విద్యార్థులలాగే ముందుకు రావాలని హైస్కూలు ముఖ్య ఉపాధ్యాయులు ధర్మన్న కోరారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు కమిటీ కార్యదర్శి శ్రీధర్, ముఖ్య ఉపాధ్యాయునిరాలు లలితశ్రీ, రిటైర్డ్ ముఖ్య ఉపాధ్యాయులు మురళీధర్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిసి నడిస్తేనే సంసారం సుఖమయం

● స్త్రీ, పురుషులు రెండు చక్రాలలాంటి వారు : అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో న్యాయాధికారి కేజీ శాంతి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి శాంతి

బళ్లారి సిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్త్రీ, పురుషులు బండికి చక్రాలలాంటివారు, ఇద్దరూ కలిసి ఐక్యంగా కదిలినప్పుడే నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించగలమని న్యాయాధికారి కేజీ శాంతి అన్నారు. నగరంలోని తాళూరు రోడ్డు నూతన జిల్లా కోర్టు సముదాయంలో శనివారం జిల్లా న్యాయ సేవల ప్రాదికార సంస్థ, జిల్లాన్యాయవ్యవస్థ, జిల్లా బార్ అసోసియేషన్, రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో పురుషుడు సాధించే విజయాల వెనుక స్త్రీ ఉన్నట్లే, అభివృద్ధి చెందుతున్న స్త్రీ వెనుక పురుషుడు కూడా ఉంటారన్నారు. స్త్రీ పురుషులు ఇద్దరూ రెండు కళ్ళులాంటివారన్నారు. 1908 లో మహిళా కార్మికులు పని గంటలు , సమాన వేతనంతో సహా ఇతర అవసరమైన ప్రయోజనాల కోసం కర్మాగారాల్లో నిరసనతో ప్రయోజనాలన్నీ పొందారన్నారు. ఈ నిరసన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు కారణమయ్యిందన్నారు. చట్ట ప్రకారం మహిళలకు ఎలాంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహం, వరకట్నం, లైంగికవేధింపులు, గృహ హింస, విడాకులు, మానసిక, శారీరక హింస వంటి వివిద సమస్యలకు సమాజంలో చట్టాలు , నిబంధనలున్నాయని మహిళలు వీటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందరికీ స్వేచ్ఛ, సమానత్వం అవసరం, కానీ స్త్రీ స్వేచ్ఛ ఏకపక్షం కాదని అర్థం చేసుకోవాలన్నారు. మహిళలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని, స్త్రీ అంటే తల్లి ఆమె తన జీవితంలోని అన్ని కష్టాలను ఓపికతో అదిగమించి ముందుకు సాగుతుంది. గతంలో మహిళలు వంటింటికే పరిమితమయ్యేవారు. కానీ ప్రస్తుతం మహిళలు సమాజంలోని అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అభివృద్ది చెందారన్నారు. స్త్రీలు పచ్చని గడ్డిలా ఎదగాలి అగడ్డిని ఎంత తొక్కినా అది మళ్ళీ మళ్ళీ మొలకెత్తుతునే ఉంటుంది. కాబట్టి మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించాలి,సానుకూల ఆలోచనలను పెంపోదించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి వాసుదేవ రాదాకంత్ గుడి,జిల్లా లీగల్ సర్వసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి , సివిల్ న్యాయమూర్తి రాజేశ్ హొసమనె, న్యాయమూర్తి అపర్ణ, న్యాయమూర్తి నస్రత్ ముఖ్తార్ అహ్మద్ ఖాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు , కోర్టు సిబ్బంది, రీడ్స్ ఇన్సిట్యూట్ ఆఫీస్ బేరర్లు, ప్రజలు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో మహిళలే కీలకం: ఎమ్మెల్యే గవియప్ప

విజయనగరం (హోస్పేట), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సమాజ ం అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్రే కీలకమని ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప అభిప్రాయపడ్డారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హోస్పేట నగరంలో జిల్లా యంత్రాంగం, జెడ్పీఎం మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ, చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత విజయాలు సాధించాలంటే పురుష సమాజ సహకారం, ప్రోత్సాహం అవసరం. ఇప్పటికే మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారు. ఆటోడ్రైవర్ల నుంచి పైలెట్ల వరకు, గ్రామ కౌన్సిలర్ల నుంచి అధ్యక్షుల వరకు మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారు. రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రధాన స్రవంతి కోసం మరిన్ని అవకాశాలు కల్పించాలి. మహిళలకు తగిన రక్షణ కల్పించడం మన కర్తవ్యం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బాలికలకు మంచి విద్యనందించాలన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ హెచ్ఎన్ఎఫ్ ఎ నియాజీ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల వృత్తి అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ గృహలక్ష్మీ, శక్తి యోజన, అన్నభాగ్య, గృహ జ్యోతి, యువనిధి పథకాలను అమలు చేసిందన్నారు. మహిళలను ఎక్కువగా గౌరవించే ప్రభుత్వమిదని అన్నారు. అనంతరం నగరంలోని డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్ జిల్లా స్టేడియం నుంచి హంపిలోని మహానవమి దిబ్బ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భరతమాత, భువనేశ్వరి దేవి, కిత్తూరు రాణి చెన్నమ్మ, మదర్ థెరిస్సా, ఒణికే ఓబవ్వ, అక్క మహాదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి, లతా మంగేష్కర్ మహిళా దినోత్సవ వేడుకలు ఆకట్టుకున్నాయి. మహిళలు సాంప్రదాయ దీరసు ఇలకల్ చీరలు కట్టుకుని బైక్ జాతాలో పాల్గొన్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు శ్వేత, జిల్లా వ్యాఖ్యాత సుభద్రాదేవి, హంపి గ్రామ చైర్‌పర్సన్ రజనీ, షణ్ముక్ గౌడ్, హంపి గ్రామసభ్యురాలు రూప్, సీడీపీవో సింధు, అంగడి, చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ భీమరాజ, సీనియర్ సూపర్‌వైజర్ అంబుజ, మిషన్ శక్తి కోఆర్డినేటర్ శివన్ననాయక్ తదితరులు పాల్గొన్నారు.



హోస్పేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

బళ్లారిరూరల్ : బళ్లారి నగరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కర్ణాటక దళిత సంఘం సమితి కార్యాలయంలో మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు ఎం శాంత జిల్లా అధ్యక్షుడు చందు ఆధ్వర్యంలో పదాధికారుల సమక్షంలో ఉత్తమ సేవలందించిన మహిళలకు కర్ణాటక దళిత సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎస్ గురుమూర్తి జిల్లా ఘటక పదాధికారులకు మహానగరపాలిక పౌర కార్మికులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించి వారికి ఉత్తమ సేవ ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రముఖులు కమల మఠ్రిస్వామి, గౌసియా, పద్మ, మల్లేశ్వరి, మమత, కమలం, పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ సేవకులకు సన్మానం..

తోరణగల్లు: కురేకుప్ప పట్టణంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టడ కార్మిక ఫెడరేషన్ అధ్యక్షులు దేవన్న, కురేకుప్ప పురాసభ అధ్యక్షులు కల్లిడప్ప మాట్లాడుతూ పురుషుల వలే మహిళలు కూడా అన్ని రంగాలలో ముందుకు వస్తున్నారని అలాగే అన్ని రంగాలలో వారికి ప్రాధాన్యం ఇవ్వాలని అలాగే వారు తమ హక్కుల కోసం పోరాటాలు చేయాలని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా కర్ణాటక ప్రాంత రైతు సంఘం తాలుకా అధ్యక్షులు జీపంపనగౌడ, ప్రముఖులు ఈరన్న, అలాగే మహిళలు బసమ్మ, మల్లమ్మ, సులోచనమ్మ, సువర్ణ, సుప్రియ, రుద్రమ్మ, నాగరత్న, సుష్మ తదితర మహిళలు పాల్గొన్నారు.



తోరణగల్లులో..

రాయచూరు: అవనిలో సగం, అంతరిక్షంలో సగం అని చెప్పుకునే మహిళలు తమకు ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంసీ ఉమా సూచించారు. మహిళలతో సమానంగా అన్ని రంగాల్లోను తమ సమర్తత నైపుణ్యంతో రాణిస్తున్న మహిళలకు ఇప్పటికే వివక్ష ఎదురుకావడం దురదృష్టకరమన్నారు. వివక్షను, సవాళ్లను ఎదుర్కొనేందుకు మహిళలు సంఘటిత శక్తిగా మారాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ, జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి ఎంసీ ఉమా మాట్లాడారు. మహిళలకు అన్ని రంగాల్లో సమానమైన అవకాశాలు ఉన్నా వాటిని అందిపుచ్చుకోవడంలో ఇప్పటికి వెనకబాటుతనం కనపడడం దురదృష్టకరమన్నారు. అదే సమయంలో మహిళలు లింగ వివక్షను సహితం ఎదుర్కొంటున్న నేటి సమాజంలో విద్యవంతులుగా ఎదగడం ఒక్కటే మహిళలకు ఆయుధమంటిదన్నారు. ఆ దిశగా ప్రతి మహిళ తనను తాను విద్యవంతురాలుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌ను న్యాయమూర్తి ప్రారంభించారు. రాజీతో పరిష్కరించుకునే కేసులను లోక్ అదాలత్ ద్వార పరిష్కరించుకోవాలని కక్షిదారుల సూచించారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం న్యాయవ్యవస్థ చేపట్టినా లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి ఉమ



మాట్లాడుతున్న జ్ఞానవికాస సభ్యులు రాము

పథకాలను సద్వినియోగం చేసుకోండి

● మహిళా దినోత్సవంలో సమాజ సేవకుడు రాము

కంప్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సమాజ సేవకుడు రాము తెలిపారు. కంప్లి తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో శనివారం క్షేత్ర ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి యోజన శ్రద్ధా మహిళా జ్ఞానవికాస కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంతో పాటు సమాజంలో సమానత్వం తీసుకురావడానికి మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని మహిళలు, బాలికల హక్కులు, సమానత్వం, సాధికారత, అనే నినాదంతో ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే సన్నాపురం గ్రామంలో ప్రాథమిక మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణంలో ప్రధానోపాధ్యాయులు సునీత ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ తమ గుర్తుగా సమాజ సేవతో పాటు సమాజంలో గుర్తుండిపోయే పనులు కూడా చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా నజ్మా సేవా ప్రతినిధి మాలా జ్ఞాన వికాస కేంద్రం అధ్యక్షురాలు, ఇతర మహిళలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సునీతకు మారి, రాజేశ్వరి, యశోద, శశికళ, రేఖ, నాజ్మ తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి సాగుతో అధిక లాభాలు



బొప్పాయి పండ్లను చూపుతున్న రైతు

కంప్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : బొప్పాయి సాగుతో రైతు అధిక లాభాలు గడించాడు. ఉపాధి పథకాన్ని తగినంతగా వినియోగించుకున్న కూడ్లిగి తాలుకాలోని 48 మంది రైతులు బంపర్ బొప్పాయిని పండించడం ద్వారా భారీ లాభాలను ఆర్జించారు. బొప్పాయి పంటను కానాహోసళ్లి, కూడ్లిగి, గుడేకోట, హంబ్లీతో సహా తాలుకాలో మొత్తం 350 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ సారి ఎకరాకు రూ.మూడు లక్షల దిగుబడి వచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుడేకోట వద్ద రైతు పరశురాము తమ 4 ఎకరాల్లో ఉపాధి పనుల ద్వారా నీరు పంటకు అందించుకొని పుష్కలంగా పంటలు పండించుకున్నారు. అలాగే మార్కెట్లో బొప్పాయికి డిమాండ్ పలకడంతో తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు గడిస్తున్నారు. ఏడాది బొప్పాయి పంట విజయనగరం, బళ్లారి జిల్లాలో వేసుకున్న రైతులకు దిగుబడులతో పాటు మార్కెట్లో రేట్లు రైతులకు లాభాలు అందించింది.

బాల్య వివాహాలను అరికట్టాలి

● అక్షరాస్యత విభాగం డిప్యూటీ డైరెక్టర్ బి.ఉమాదేవి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉమాదేవి

బళ్లారి సిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి):బాలికలు ఉన్నత విద్యను అభ్యసించేలా చూడాలని, బాల్య వివాహాలను అరికట్టాలని బళ్లారి జిల్లా పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం డిప్యూటీ డైరెక్టర్ బి.ఉమాదేవి విద్యార్థులకు పిలుపు నిచ్చారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన శారద పూజ, వీడ్కోలు కార్యక్రమంలో ఆమె జ్యోతి వెలిగించి మాట్లాడారు. గ్రామాల్లో పదవ తరగతి పూర్తి చేయగానే పెళ్ళి చేసుకోవడం ఆచారం. దీన్ని బాల్య వివాహం అని భావించి వారు తప్పుచేస్తున్నారు. దీని నుండి విముక్తి పొందాలంటే అమ్మాయిలు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. మీరు కూడా ఒక ఉపాధ్యాయుడిగా,వైద్యుడిగా,డీసీగా,ఎస్పీగా సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌ను వీక్షించి తన ప్రశంసలను వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రాధానోపాధ్యాయుడు రవిచెళ్లగుర్కి మాట్లాడుతూ విద్యకు అధిపతి అయిన శారదదేవత గురించి మాట్లాడారు. పాఠశాలలు ,కళాశాలలలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ప్రతిసంవత్సరం వారదను పూజించడం భారతయ సంస్కృతి. మీ జ్ఞానం, జ్ఞాపకశక్తి నిస్సందేహంగా పెరుగుగా అని ఆయన అన్నారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. జిల్లా వృత్తి విద్య సబ్జెక్ట్ ఇన్‌స్పెక్టర్ వేదావతి, ఈసీఓ గుళ్యప్ప, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, చన్నమ్మ, సుమతి,వైశాలి,శ్వేత, శేషమ్మ, రామాంజినేయ, గురుప్రసాద్, విజయ ముండ్రగి, మీనాక్షి, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

● 123 మొబైల్స్ రికవరీ చేసిన సిబ్బందికి ఎస్పీ ప్రశంసలు



మొబైల్స్‌ను అందజేస్తున్న ఎస్పీ శ్రీహరిబాబు

హోస్పేట (విజయనగరం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): హోస్పేట సబ్ డివిజన్ పరిధిలో చోరీ అయిన మొబైల్ ఫోన్లను పోలీసులు సొంతదారులకు అప్పగించారు. సెల్‌ఫోన్లను రికవరీ చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు ప్రశంసించారు. శనివాంరం సండూరు రోడ్డులోని డీఎస్పీ కార్యాలయంలో పలువురికి మొబైల్స్ అందించారు. హోస్పేట సబ్ డివిజన్‌లైన బరాదావస్ పోలీస్ స్టేషన్, టౌన్ పోలీస్‌స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సెల్‌పోన్లు యజమానులకు అందించారు. చిట్వాడి పోలీస్ స్టేషన్, కమలాపూర్, హంపి టూరిస్ట్ పోలీస్ స్టేషన్, టీబీ డ్యామ్ పోలీస్ స్టేషన్ల నుండి దొంగలించబడిన రూ. 2 లక్షలు విలువైన 123 మొబైల్ ఫోన్లను గుర్తించి వాటిని గుర్తించారు. మొబైల్ ఫోన్లను అస్సాం, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్ర, కేరళ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో రికవరీ చేసినట్లు పోలీసుఏలు తెలిపారు. సీడీఆర్ యూనిట్‌కు చెందిన ఎస్ఐ విరుపాక్ష, మహిళా పీసీ ఆర్ నందిని, కుమార నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

కర్ణాటకలో తమిళ సినిమాలు ఆడనివ్వం

● వాటాళ్‌నాగరాజ్ హెచ్చరిక

హోసూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని మేకెదాటు డ్యామ్‌ను నెల రోజుల్లోగా నిర్మించేందుకు తమకు అభ్యంతరం లేదని తమిళనాడు ప్రభుత్వం చెబితే తప్ప తమిళ సినిమాలు ప్రదర్శింపచేయమని వాటాల్ నాగరాజ్ హెచ్చరించారు. కర్ణాటక, మహారాష్ట్ర మధ్య రవాణా సేవల వివాదంపై మార్చి 22న రాష్ట్ర వ్యాప్త బంద్ నిర్వహిస్తున్నట్లు కన్నడ సంస్థలు ప్రకటించాయి. ఈ తరుణంలో కన్నడ చలువళి వాటాళ్‌నాగరాజ్ నేతృత్వంలో కన్నడ సంస్థలకు చెందిన 100 మందికిపైగా హోసూరు సమీపంలోని తమిళనాడు-కర్ణాటక సరిహద్దు అత్తిపల్లి ప్రాంతంలో జరిగిన రాస్తారోకోలో పాల్గొని తమిళనాడులోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన వారిని ఆనేకల్ పోలీసులు అరెస్టు చేశారు, అంతకుముందు మీడియాతో వాటాళ్‌నాగరాజ్ మాట్లాడుతూ మహారాష్ట్రనే కాదు, తమిళనాడు ప్రభుత్వాన్ని కూడా ఖండిస్తున్నామన్నారు. మేకెదాటు ఆనకట్టకు అభ్యంతరం లేదని తమిళనాడు ప్రభుత్వ నెలరోజుల్లోగా నివేదిక ఇవ్వాలన్నారు. సీఎం ఎం.కే.స్టాలిన్ మాత్రమే కాదు, తమిళనాడు నేతలంతా మేకెదాటును వ్యతిరేకిస్తున్నారన్నారు. త్రిభాషా విద్యా విధానానికి వ్యతిరేకంగా దక్షిణభారత రాష్ట్ర ప్రతినిధులు జాయింట్ యాక్షన్ కమిటీని వ్యతిరేకిస్తున్నామన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, నియోజకవర్గాల సంఖ్య తగ్గదు, తగ్గితే కేంద్ర ప్రభుత్వంపై కూడా పోరాడతామన్నారు. తమిళనాడులో హిందీ నిరసన కంటే కర్ణాటక రాష్ట్రంలో హిందీ బాషపై పెద్ద ఎత్తున నిరసనలు నిర్వహిస్తామన్నారు.



ధర్నాలో పాల్గొన్న వాటాళ్ నాగరాజ్

సమీకృత సాగుపై రైతులకు శిక్షణ



ఆత్మా పథకం కింద రైతులకు అవగాహన

హోసూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సమీకృత వ్యవసాయంపై శిక్షణ ఇచ్చేందుకు కొయంబత్తూరుకు శూలగిరి రైతులను తీసుకెళ్లారు. శూలగిరి జిల్లా వ్యవసాయ శాఖ విస్తరణ పథకాల (ఆత్మా) కింద తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రైతులను తీసుకెళుతున్నట్లు డాక్టర్లు కదిరవన్, తిరునావుకరసు, భూమిరాజు, రామ్ ప్రవీణ్ అసిస్టెంట్ అగ్రికల్చర్ అధికారి రాజా తెలిపారు. ఆల్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్టు దేశంలో అమలవుతున్న అతిపెద్ద ప్రాజెక్టులలో ఒకటి అన్నారు. ఈ కార్యక్రమం 1956-57లో దేశంలోని అన్ని వ్యవసాయ-పర్యావరణ కేంద్రాలతో సాయిల్ ఫెర్టిలిటీ అండ్ అప్లికేషన్ ప్రోగ్రామ్ కొనసాగింపుగా ప్రారంభించినట్లు తెలిపారు. తమిళనాడులో ప్రధాన కేంద్రం కోయంబత్తూరులో వ్యవసాయ శాస్త్రాల శాఖ, తంజావూరులో ఉపకేంద్రం, మట్టి, నీటి నిర్వహణ పరిశోధనా సంస్థ, ఆముదం పరిశోధనా కేంద్రం, రెండు ఏఎఫ్ఆర్ కేంద్రాలు ఉన్నాయన్నారు. భవానిసాగర్, వ్యవసాయ పరిశోధనా కేంద్రం పనిచేస్తోందన్నారు. కోయంబత్తూరుల్లోని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవసాయ శాస్త్రాల విభాగంలో 1973 నుంచి సమీకృత వ్యవసాయంపై ఆల్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ ప్రోగ్రామ్ పనిచేస్తోందన్నారు. శిక్షణకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా టెక్నికల్ మేనేజర్ ప్రియ, అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్లు మహమ్మద్ రఫీ, పళనిస్వామి పర్యవేక్షిస్తున్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

హోసూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : హోసూరు కార్పొరేషన్ కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య శిబిరాన్ని ప్రారంభించారు. పబ్లిక్ హెల్త్ కమిటీ చైర్మన్ మాదేశ్వరన్, టాక్సేషన్ కమిటీ చైర్మన్ చెన్నీరప్ప పాల్గొన్నారు. మున్సిపల్ సంక్షేమాధికారి అజిత, కౌన్సిలర్లు లక్ష్మి, మోసింతాజ్, మంజుల, అకౌంట్స్ కమిటీ హెడ్ పార్వతి నాగరాజు, మల్లికా దేవరాజ్, క్లీనింగ్ సిబ్బంది 20 కిలోల కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు, అధికారులు, ఉద్యోగులకు వైద్య పరీక్షల నిర్వహించారు. మండలాధ్యక్షుడు రవి, కౌన్సిలర్లు నాగరాజు, మంజునాథ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



కార్మికులకు చికిత్స చేస్తున్న వైద్యులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

యూరీ గగారిన్ (జయంతి)



ప్రముఖ సోవియట్ వ్యోమగామి యూరీ గగారిన్ 1934 మార్చి 9న జన్మించారు. రష్యన్లు ఆయనను సోవియట్ హీరోగా పరిగణిస్తారు. పూర్తి పేరు యూరీ అలెక్సెయెవిచ్ గగారిన్. 1961 ఏప్రిల్ 12న అంతరిక్షంలోకి వెళ్లిన మొట్టమొదటి మానవుడిగా చరిత్ర సృష్టించారు. అలాగే సోవియట్ కూడానూ, భూమి చుట్టూ కక్ష్యలో పరిభ్రమించినవాడుగాను రికార్డు నమోదు చేశారు. అంతరిక్షంలోకి ప్రయాణించినందుకు ప్రపంచంలోని అనేక దేశాలు, పతకాలు, బహుమతులతో గౌరవించారు. 1968 మార్చి 27న కన్నుమూశారు.

జాకీర్ హుస్సేన్ (జయంతి)



తబలా వాదనలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన 'పద్మభూషణ్' పురస్కార గ్రహీత ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ 1951 మార్చి 9న ముంబైలో జన్మించారు. తబలా వాయిద్యకారుడు. తండ్రి ఖురేషి అల్లారఖా ఖాన్ వద్దనే తర్ఫీదు పొంది రాణించారు. స్వరకర్తగా, సంగీత దర్శకుడిగా పేరొందారు. హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంలో గాయనంలోనూ, వాద్యంలోనూ పండిట్ రవిశంకర్, భీమ్‌సేన్‌జోషి వంటి ప్రముఖులతో కలసి కచేరీలు ప్రదర్శించారు. గ్రామీ అవార్డు, పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2024 డిసెంబరు 15న కన్నుమూశారు.

శశి థరూర్ (పుట్టినరోజు)



శశిథరూర్ 1956 మార్చి 9న లండన్‌లో జన్మించారు. కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌కు చెందిన రాజకీయ నేత. తిరువనంతపురం నుంచి లోక్‌సభ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్‌గా వ్యవహరించారు. యునైటెడ్ నేషన్స్‌లో పలు హోదాలలో కొనసాగారు. కేంద్ర విదేశీ వ్యవహారాలు, మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా వ్యవహరించారు. అంతేకాక రచయితగా చరిత్ర, సంస్కృతి, రాజకీయం, సామాజిక, తదితర అంశాలపై 19 ప్రముఖ పుస్తకాలు రాశారు. ప్రవాసి భారతీ సమ్మాన్, రజికా కృపాలాని యంగ్ జర్నలిస్టు అవార్డ్ అండర్ 30 తదితర పురస్కారాలు పొందారు.

ఆర్‌పీ పట్నాయక్ (పుట్టినరోజు)



రవీంద్రప్రసాద్ పట్నాయక్ 1970 మార్చి 9న మన్యం జిల్లా పార్వతీపురం ప్రాంతంలో జన్మించారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో 75కుపైగా సినిమాలకు సంగీతం అందించారు. 'నీ కోసం' సినిమాతో అరంగేట్రం చేశారు. నువ్వు-నేను, సంతోషం, ఎక్స్‌క్యూజ్‌మీ సినిమాలకు వరుసగా ఫిల్మ్‌ఫేర్ అందుకున్నారు. మూడు నంది, ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. 2002 జూలై 20న విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన సంగీత విభావరికి 6 లక్షల మందికిపైగా పాల్గొనడం ప్రత్యేకం. స్వరకర్తగా, గాయకుడిగా, సంగీత దర్శకుడిగా రాణించారు. అంతేకాక కొన్నింటికి దర్శకత్వం వహించి, నటించారు. 2016లో 'మనలో ఒకడు' కు థర్డ్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్‌గా గుర్తింపు పొందింది. నందూరి సుబ్బారావు రచించిన 'ఎంకి పాటలు'ను జానపదాల ఆల్బమ్‌గా ఆర్‌పీ విడుదల చేశారు.



అన్నింటా రాణింపు

నారీమణి చిత్రాన్ని గీసిన ఉపాధ్యాయుడు

రామగిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీరాములు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నారీమణి చిత్రాన్ని చిత్రీకరించారు. నేటి సమాజంలో మహిళ అన్ని రంగాల్లో రాణిస్తోందని చూపుతూ స్త్రీని తల్లిగా , వ్యాపారవేత్తగా, వైద్యురాలిగా, ఉపాధ్యాయురాలిగా, క్రీడలు, వ్యాయామ విభాగాల్లో సైతం మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని చాటి చెబుతూ రంగుల్లో ఓ చిత్రాన్ని అద్భుతంగా గీశారు. దీన్ని చూసిన తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీరాములు మాస్టారును అభినందించారు.

ఆడబిడ్డను పుట్టనిద్దాం... ఎదగనిద్దాం: డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష లేకుండా ప్రతి ఆడబిడ్డను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం అని డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి పిలుపునిచ్చారు. జిల్లావైద్యశాఖ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లోనూ అభివృద్ధిపథంలో నడుస్తున్నారన్నారు. ఎలాంటి సమస్యలకు భయపడకుండా పనిచేయాలని మహిళా వైద్య ఉద్యోగులకు సూచించా రు. కార్యక్రమంలో ఏఓ గిరిజామనోహర్, డెమోలు త్యాగరాజు, గంగాధర్, మహిళా ఉద్యోగులుపాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు



అంకురార్పణ (ఫైల్)

నేటి నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

కదిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన కదిరి లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. అంకుర్పారణతో మొదలై ఈనెల 23న పుష్పయాగోత్సవంతో ముగుస్తాయి. కాటమరాయుని తిరునాళ్లను కన్నులారా వీక్షించేందుకు కదిరి ప్రాంతనుంచేకాకుండా చుట్టుపక్కల జిల్లాలతోపాటు కర్ణాటక రాష్ట్రంనుంచి లక్షలాది మంది తరలివస్తారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యంగా కల్యాణోత్సవం, మోహిని ఉత్సవం, గరుడసేవ, బ్రహ్మ రథోత్సవం, తీర్థవాది ముఖ్యమైనవి. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటితో పాటు ఉచిత భోజన సదుపాయాన్ని ఆలయంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రేపు కదిరికి నారా లోకేశ్

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈనెల 10న కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడానికి వస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. శనివారం పీవీఆర్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 10న జరగనున్న కల్యాణోత్సవానికి లోకేశ్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఆయన పట్టువస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. కదిరి నియోజకవర్గంలో జరిగే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు ఇవ్వడం టీడీపీ ప్రభుత్వంలోనే ప్రారంభించామని గుర్తు చేశారు. ఉత్సవాలను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని కోరారు. యువత పెద్దఎత్తున ఉత్సవాల్లో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు ఉండకూడదని అన్నారు. భక్తులకు అసౌకర్యం కలిగితే ఈఓ, ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాని తెలిపారు. పోలీస్ శాఖ ఫ్రెండ్లీగా విధులు నిర్వర్తించాలన్నారు. ఆర్డీవో వీవీఎస్ శర్మ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. హిందూపురం రోడ్డులో ఉచితంగా మినీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషన్ కిరణ్‌కుమార్, ఈఓ శ్రీనివాసరెడ్డి, సీఐ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల్లో పండ్ల తోటల దగ్ధం

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన అగ్నిప్రమాదాల్లో పండ్ల తోటలు కాలిపోయాయి. గార్లదిన్నె మండలం పెనకచెర్లలో చీనీ చెట్లు, కల్లూరు గ్రామంలో మామిడి చెట్లు, అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లలో దానిమ్మ తోట అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో లక్షల రూపాయల పంట నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. ఏళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంట కళ్లెదుటే అగ్నికి ఆహుతవడంతో రైతులు బోరున విలపించారు.



పెనకచర్లలో ప్రమాద వివరాలను తెలుసుకుంటున్న పోలీసులు

గార్లదిన్నె/అనంతపురంరూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో చీనీతోటలు కాలిపోయాయి. దీంతో రూ. 15 లక్షలు ఆస్తి నష్టం కలిగింది. పెనకచెర్ల గ్రామానికి చెందిన రైతులు రామాంజనేయులు, అనిల్ తమకున్న పొలంలో చీనీచెట్లు సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈఏడాది దిగుబడి బాగా వచ్చిందని సంబరపడ్డారు. మరో 10 రోజులుంటే కోతకోయాల్సి ఉంది. రామాంజనేయులు సుమారు 600 చెట్లు, రైతు అనిల్ దాదాపు 500 చీనీచెట్లను ఏడేళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అయితే శనివారం మధ్యాహ్నం వీరి తోటలలో మంటలు వ్యాపించి చెట్లను దహించివేశాయి. సుమారు రూ. 15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. జమేదార్ ఫిరోజ్ బాషా సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని బాధిత రైతులతో వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్లూరులో మామిడి చెట్లు ...

కల్లూరు గ్రామంలో విశ్వమూర్తి అనే రైతుకు చెందిన మామిడి చెట్లు శనివారం దగ్ధమయ్యాయి. కొండకింద కొట్టాల సమీపంలో రైతు విశ్వమూర్తి మామిడి పంట సాగు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సుమారు 15 మామిడి చెట్లు కాలిపోవడంతో రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

తాటిచెర్లలో దానిమ్మతోట..

అనంతపురం రూరల్ మండలంలోని తాటిచెర్లలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో దానిమ్మతోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన బ్యాళ్ల లక్ష్మీనారాయణ మూడు ఎకరాల్లో నాలుగేళ్ల కిందట దానిమ్మ సాగు చేశారు. దాదాపు 1200 చెట్లు పెంచుతున్నాడు. అయితే శుక్రవారం సాయంత్రం పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి వెలువడిన నిప్పురవ్వలతో మంటలు వ్యాపించి తోట కాలియింది. దానిమ్మ చెట్లతో పాటు, తోటలోని బోరు బావి వద్దనున్న పైపులైన్, స్టార్టర్ పెట్టె, కేసింగ్ వైరు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.4లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



తాటిచెర్లలో కాలి పోయిన దానిమ్మ తోట

జీఆర్పీ అదుపులో దొంగ



నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సొమ్ముతో జీఆర్పీ పోలీసులు

గుంతకల్లు, మార్చి8(ఆంధ్రజ్యోతి): రైళ్లల్లో నేరాలకు పాల్పడిన ఓ వ్యక్తిని అనంతపురం జిల్లా రైల్వే పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.79 వేలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్‌లో అరెస్టు వివరాలను సీఐ అజయ్‌కుమార్ తెలియజేశారు. రైల్వే ప్లాట్‌ఫాంలపై అనుమానాస్పదంగా కనిపించిన వారిని విచారించే క్రమంలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. గుంటూరు నగరానికి చెందిన హర్షవర్ధన్ రెడ్డి అనే ఈ వ్యక్తి ఏడో నంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని విచారించామన్నారు. క్రమంలోనే అతడిని రైళ్లల్లో దొంగతనాలకు పాల్పడే వ్యక్తిగా గుర్తించామన్నారు. అతడిని అరెస్టుచేసి రూ. 79 వేలు, ఒక బంగారు డాలర్, రెండు వెండి పట్టీలు, ఓ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, రిమాండుకు తరలిం చినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర, ఆర్పీఎఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 240 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నా రు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి



మేయర్‌కు వినతి పత్రం అందిస్తున్న మేకల ఈశ్వరరెడ్డి

బళ్లారి సిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సంగనకల్లు గ్రామం పంచాయతీ పరిధిలోని బళ్లారి నగరానికి చెందిన స్మశానవాటికను శుభ్రం చేయాలని, అందులో మౌలిక సౌకర్యాలు కల్పించాలని యువ సేనా సోషల్ యాక్షన్ క్లబ్ కార్పొరేషన్ మేయర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యాక్షన్ క్లబ్ అధ్యక్షుడు మేకల ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ చాలా సంవత్సరాల క్రిందట ఒకదాత స్మశానవాటికగా ఉపయోగించేకునేందుకు నగరవాసులకు సుమారు 12ఎకరాల భూమిన దాతలు ఇచ్చారన్నారు. ఇటీవల అందులో మౌలిక సౌకర్యాలు లేక ,విద్యుత్‌స్తంభాలు, బాత్రూములు, నీటి వ్యవస్థ ఇతర ప్రాథమిక సౌకర్యాలను కల్పించాలని అందులో ఓ ఆలయాన్ని ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా కార్యకర్తలు కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పర మల్లప్ప, జగన్నాథ్, నారాయణ, వెంకటేశ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

టీటీసీ ఫలితాల విడుదల

అనంతపురం విద్య, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): టీటీసీ థియరీ-2024 లోయర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయయని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 27న నిర్వహించిన పరీక్షలు ఫలితాలు ఈ నెల 7న విడుదలయ్యాయన్నారు. ఫలితాలు http-s://www.bse.ap.gov.in సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

సౌరశక్తిని సద్వినియోగం చేసుకోవాలి

● సూర్యకాన్- 2025 సదస్సులో వక్తలు

బెంగళూరు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): అనుకూలం ఉన్న ప్రతిచోటా సౌరశక్తి ఉత్పాదన కావాలని తద్వారా ప్రకృతిలో లభించే శక్తిని సద్వినియోగం చేసుకున్నట్లు అవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. సూర్యకాన్-2025 సదస్సు నగరంలో జరిగింది. టెక్నికల్ ప్రదర్శనలు, నెట్‌వర్కింగ్ సెషన్‌లలో భాగస్వామ్యులైన వివిధ సోలార్ కంపెనీలు భవిష్యత్‌లో సోలార్ ఎనర్జీ ప్రభావాలు అనే అంశంపై మాట్లాడారు. 25 గిగా వ్యాట్‌ల కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన రాష్ట్రం సౌరశక్తి ప్రముఖ కేంద్రంగా కొనసాగుతోందన్నారు సోలార్ రంగంలో సాధనలపై ఏటా ఉత్తమ అవార్డులను ఇవ్వాలని తీర్మానించారు. నగర ప్రాంతాలలో ఇళ్లపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్న విధంగానే పరిశ్రమలు, గ్రామీణ ప్రాంతాలలో కొత్తగా నిర్మించే నివాసాలపైనా అమర్చుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. మేక్ ఇన్ ఇండియా దిశగా సోలార్ రంగంలో ప్రగతి సాధిద్దామని నిర్ణయించారు.

23న చండికాహోమం

బెంగళూరు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): నందవరీక్ మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 23న చండికాహోమం, చౌడేశ్వరీదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు బీఎం భానుమూర్తి వెల్లడించారు. బెంగళూరు చామరాజపేట శృంగేరి శంకరమఠం ఆవరణంలో జగద్గురువులు భారతీతీర్థ స్వామీజీ, విధుశేఖర భారతీతీర్థ స్వామీజీల అనుగ్రహంతో లోకకళ్యాణార్థం హోమం జరుపుతు న్నామన్నారు. వేదబ్రహ్మ కెఎస్ గణేషసోమయాజి పర్యవేక్షణలో వేదపండితులు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 23న ఆదివారం ఉదయం గురుప్రార్థన, గణపతి పూజ, కుంకుమార్చన, చండికా పారాయణ, చండికా హోమం ఉంటుందని, మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతి, మహామంగళారతి జరుగుతుందన్నారు. చండికా హోమం, కుంకుమార్చనలో పాల్గొనదలచిన వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నగరంలో నటి అషికా రంగనాథ్ సందడి

బెంగళూరు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటి అషికా రంగనాథ్ నగరంలోని ఫీనిక్స్ మాల్‌లో సందడి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన బ్రాండ్ అలెన్‌సోలి సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన బ్యాగ్ యువర్ స్టార్స్ ఉత్సవ్‌ను లాంచనంగా ప్రారంభించారు. నటి అశికాను చూసేందుకు అభిమానులు తరలివచ్చారు. ఇదే సందర్భంగా అశికా మాట్లాడుతూ సమాజంలో ప్రతి మనిషి అందంగా హుందాగా ఉండాలని భావిస్తారని అందుకే బ్రాండెడ్ వస్తువులను దక్కించుకునేందుకు ఆసక్తి చూపుతారన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మాతా రమ్యానంద భారతీ స్వామి



భక్తులకు సందేశం ఇస్తున్న మాతా రమ్యానంద భారతీ

బెంగళూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికం ద్వారా మానసిక ప్రశాంతత సాధ్యమని తిరుపతి శక్తిపీఠం మాతాజీ రమ్యానంద భారతీ స్వామీ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైట్‌ఫీల్డ్ చైతన్యభారతి మైదానంలో బృహత్ లలితాసహస్రనామ పారాయణ, సవాసినీ పూజా కార్యక్రమాలు జరిగాయి. ఇదే సందర్భంగా మహిళా భక్తులను ఉద్దేశించి మాతా రమ్యానంద భారతీ మాట్లాడుతూ మహిళలకు మన సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. శక్తికి ప్రతి స్వరూపమన్నారు. కుటుంబంతో పాటు సమాజాన్ని సరైన మార్గంలో తీసుకెళ్ళే సామర్థ్యం, ఓర్పు మహిళలకు ఉన్నాయన్నారు. అందుకే భారతీయ మహిళలు విశ్వంలోనే కీలకులుగా రాణిస్తున్నారన్నారు. సనాతన కాలం నుంచి వచ్చిన మన సంప్రదాయాలను పాటించాలని ప్రతి కుటుంబంలోను పిల్లలకు సంస్కృతి నేర్పాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో బేల్దారి మృతి



మృతి చెందిన రవి

గుత్తి రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామ శివారు 67వ జాతీయ రహదారిపై శనివారం అనుమానాస్పద స్థితిలో బేల్దారి రవి(36) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గుంతకల్లు పట్టణంలోని ఉమామహేశ్వరనగర్‌కు చెందిన రవి బేల్దారి పని చేసుకుంటూ జీవించేవాడు. గుత్తికి చెందిన యువతితో ఇతడికి వివాహం జరిగింది. అయితే ఆమె ఆరు నెలల కిందట భర్తను వదిలి పుట్టింటికి వెళ్లింది. పని నిమిత్తం బయటకు వెళ్తున్నానని శుక్రవారం రాత్రి రవి తల్లిదండ్రులకు తెలిపాడు. ఉదయం శ్రీపురం వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో బేల్దారి రవిగా గుర్తించి కుటుంబ సభ్యులు, బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పలు కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అబ్బేదొడ్డిలో చైన్ స్నాచింగ్

గుత్తిరూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని అబ్బేదొడ్డిలో శనివారం తెల్లవారుజామున చైన్ స్నాచింగ్ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఇంటి ఎదుట పని చేసుకుంటున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మెడలోని బంగారం చైన్‌ను లాగాడు. అయితే ఆమె అప్రమత్తమై చైన్‌ను గట్టిగా పట్టుకోవడంతో అది రెండు భాగాలుగా తెగిపోయింది. ఆమె కేకలు వేయడంతో దొరికిన ముక్కతో దుండగడు పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.